క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

మామిడికుదురు: మామిడికుదురు మండల పరిధిలో బుధవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. బుధ, గురువారాలు మొగలికుదురు, పాశర్లపూడిలంక గ్రామాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. 21, 22 తేదీల్లో నగరం-1, లూటుకుర్రు గ్రామాల్లో, 25, 26 తేదీల్లో మామిడికుదురు-1, ఈదరాడ గ్రామాల్లో, 27, 28 తేదీల్లో పాశర్లపూడి-1, 27న ఆదుర్రు, 28న కొమరాడ గ్రామంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తు గాయాలపాలైన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాజమహేంద్రవరం అర్బన్ ఏరియాకి చెందిన షేక్ మస్తాన్ ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు విరిగిపోవడంతో మంచాన పడ్డారు. తర్వాత ఇంట్లో పడిపోవడంతో చెయ్యి విరిగింది. ఉన్న ఒక్క కొడుకూ మృతి చెందడంతో ఆయన పనికి వెళ్లలేక పోషించే వారు ఎవరు లేక ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. సేవా సంస్థ సభ్యులు రాజహేంద్రవరంలోని మస్తాన్ ఇంటికి వెళ్లి రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

కొత్తగా ఎంఎల్ఎస్ పాయింట్

సఖినేటిపల్లి: స్థానిక మార్కెట్ యార్డు గోడౌన్ నుంచి నెలవారీ బియ్యం, ఇతర సరకులు రేషన్ షాపులకు పంపిణీ కోసం కొత్తగా ఎంఎల్ఎస్ పాయింట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విషయాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై సఖినేటిపల్లి గోడౌన్ నుంచి రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో 110 రేషన్ షాపులకు సరకుల పంపిణీ కానున్నట్టు తెలిపారు.

సీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పన

పి.గన్నవరం: నాగుల్లంక సీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పి.గన్నవరం ఎంపీపీ, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ గనిశెట్టి నాగలక్ష్మి అన్నారు. మంగళవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో వడగాల్పుల నుంచి రక్షణ పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు ఎక్కువగా జరిగాలా చూడాలని, అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయాలని ఆమె సూచించారు. వైద్యాధికారి షేక్ జాసిమ్, సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సత్యనారాయణ, ఎ.నాగరాజు, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రావులపాలెం: సమాజంలో ఇంట్లో గానీ, బయట గానీ మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు వారికి ఉన్న చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవడం ద్వారా అరికట్టవచ్చునని సీఐడీ ఇన్‌స్పెక్టర్ జేమ్స్ రత్నప్రసాద్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు సీఐడీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇన్‌స్పెక్టర్ జేమ్స్ రత్నప్రసాద్ క్రైమ్ ఎగైనెస్ట్ ద ఉమెన్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు, యువతలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కలిగించారు. సమావేశంలో సీఐడీ ఇన్‌స్పెక్టర్లు కేపీ స్వామి, బి.వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ కార్యదర్శికి పదోన్నతి

ఆలమూరు: మడికి గ్రామ సచివాలయం-2 కార్యదర్శి షేక్ మహమ్మద్ ఆలీకి పదోన్నతి లభించింది. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాల యంలో మంగళవారం గ్రామ సచివాలయ కార్యదర్శుల పదోన్నతిపై కౌన్సిలింగ్ జరిగింది. గ్రామ ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-5 కార్యదర్శులుగా పని చేస్తున్న మహమ్మద్ ఆలీని గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించారు. పదోన్నతుల్లో భాగంగా మహమ్మద్ ఆలీని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చెట్టి గ్రామ పంచాయతీకి నియమించారు.

కోకో సాగుపై రైతులకు అవగాహన

అయినవిల్లి: కోకో పంట సాగుపై రైతులకు ఉద్యాన అధికారి ఎన్.ప్రసన్నలక్ష్మి మంగళవారం అవగాహన కల్పించారు. అయినవిల్లి లంక గ్రామంలో కోకో రైతులకు మ్యాడ్‌లైజ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన అధికారి ఎన్. ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ కోకో గింజలకు జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండు ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ఒడుదొడుకుల కారణంగా 2024లో కిలో నాణ్యమైన కోకో గింజలను రూ.950 నుంచి రూ.1000 వరకు కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం ధర రూ.550 నుంచి రూ.650కు పడిపో యిందన్నారు. ఉదాన్య శాఖ వీహెచ్ఏలు నాయకులు పాల్గొన్నారు.

పునరావాసాలను పట్టించుకోరా!

- శిథిలావస్థలో తుపాను భవనాలు
- అభివృద్ధికి ఆమడ దూరంలో గ్రామాలు
- తుపానులొస్తే నిలువ నీడ కరువు
- ఏళ్లు గడుస్తున్నా వదలని నిర్లక్ష్యం
- సముద్రతీర గ్రామాల్లో దుస్థితి



శంకరగుప్తంలో శిథిల స్థితిలో ఉన్న తుపాను ఆశ్రయ భవనం

మలికిపురం: రాజోలు దీవి గ్రామాలు ఎక్కువ శాతం సముద్ర తీరం వెంబడే ఉన్నాయి. తీరంలో ఉండడంతో వర్షాకాలంలో ఎక్కువగా ఆయా గ్రామాలు తుపానులకు గురవుతున్నాయి. ఎక్కువ వర్షాలు, తుపానుల సమయంలో ఆయా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో అక్కడ ప్రజలు తలదాచుకోవడానికి పునరావసాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఉన్న తుపాను షెల్టర్లుశిథిలావస్థకు చేరాయి. దీంతో రాజోలు దీవి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

రాజోలు దీవిలో గ్రామాలు సముద్ర తీరంలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో లక్షకు పైగా జనాభా ఉంది. ఈ గ్రామాలన్నీ లోతట్టు ప్రాంతాల్లోనే ఉండడంతో వర్షా కాలంలో తరచూ ముంపున బారిన పడుతుంటాయి. ఇక్కడ ప్రజలు నిరుపేదలు. వర్షాలొస్తే ఈ తీర ప్రాంతాలన్నీ మోకాలి లోతు నీటిలో మునిగి పోతున్నాయి. ఈదురు గాలుల బీభత్సానికి అతలాకుతలమవుతున్నాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ గ్రామాల్లో కనీసం తుపానులొస్తే తలదాచు కోవడానికి ఒక్క షెల్టర్ కూడా లేదు. ఉన్న షెల్టర్లన్నీ పూర్తిగా శిథిలమయ్యాయి. సుమారు 25 ఏళ్లుగా ఇవి ఇదే దుస్థితిలో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో స్థానికులు ఈ శిథిల భవనాలనే వినియోగిస్తున్నారు. ఏ క్షణాన ఇవి కూలుతాయో తెలియవు. వాటిలోనే తాత్కాలికంగా తుపాను సమయాలలో ఉండడంపై ఆందోళన వ్యక్తమవుతున్నాయి. వీటి పునర్నిర్మాణానికి అనేక మార్లు ప్రతి పాదనలు వెళ్లినా ఫలితం శూన్యం. ఐదేళ్ల క్రితం నుంచి పలుమార్లు అధికారులు బృందం తీరంలో పర్యటించి శిథిల స్థితిలో ఉన్న తుపాను కేంద్ర భవనాలను పరిశీలించి వెళ్లింది. ఈ భవనాలలో కొన్నింటిని మరమ్మతులు చేయడానికి, మరికొన్ని పునర్నిర్మించడానికి ఆ బృందం సూచనలు చేసింది. అయితే ఆ ప్రతిపాదనలు బుట్టదాఖలాలయ్యాయి తప్ప నేటికీ అమలుకు నోచుకోలేదు. కరవాకలో ఒకటి, తూర్పుపాలెం ఒకటి, చింతలమోరిలో 2, శంకరగుప్తం, కేశవదాసుపాలెం, గూడపల్లి, జి.పల్లిపాలెం, గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున తుఫాను ఆశ్రయ భవనాలు ఉన్నాయి. పడమటిపాలెం, కేశనపల్లి, పల్లిపాలెం గ్రామాలో కొత్తవి నిర్మాణం చేశారు. కానీ మిగిలినవి వదిలేశారు. ఇవి సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో నాణ్యతా లోపాల వల్ల కూడా ఇవి త్వరితగతిన శిథిల స్థితికి చేరాయని స్థానికులు పేర్కొంటున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు తగ్గట్టుగా అప్పట్లో వాటిని నిర్మించారు. అయితే ప్రస్తుత జనాభాకు అనుగుణంగా మరిన్ని నిర్మించకపోగా కనీసం శిథిలమైన వాటిని కూడా పట్టించుకోవడంలేదు.

శిథిలావస్థలో ఉండడంతో..

ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో అనేక ఇళ్లు నేలకొరిగాయి. కాలనీలు మునిగాయి. ఆ సమయంలో గత్యంతరం లేక కొందరు శిథిల భవనాల్లో ఉన్నారు. అక్కడకు వెళ్ల లేక కొంత మంది ముంపు నీటిలోనే ఉన్నారు. ఇదిలా ఉండగా శిథిలమైన భవనాల స్థానంలో వెంటనే కొత్త భవనాలతో పాటు అదనపు భవనాలను కూడా నిర్మించాలని తీర ప్రాంత ప్రజానీకం కోరుతోంది.

రక్షణ లేదు

తుపానులొస్తే రాజోల దీవిలోని సముద్ర తీర ప్రాంత ప్రజలకు రక్షణ లేదు. తీరంగా గత కొంత కాలంగా తుపానుల ప్రభావం తీవ్రంగానే ఉంటోంది. సముద్ర కెరటాల ఉధృతి కూడా అధికంగానే ఉంటుంది. అక్రమ ఇసుక వ్యాపారం వల్ల రక్షణ కవచాల్లా ఉండే ఇసుక దిబ్బలు కనుమరుగయ్యాయి. డ్రైన్ల సౌకర్యం కూడా లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రానున్న వర్షాకాలం ఏ విధంగా గడుస్తుందో వేచి చూడాలి.

కూటమి దుర్మార్గపు పాలనను తిప్పి కొట్టాలి

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



సమావేశంలో పార్టీ నాయకులతో మాజీ మంత్రి సూర్యారావు

మలికిపురం: కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనను తిప్పి కొట్టాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజక వర్గ పార్టీ నాయకులు అనుబంధ సంఘాల కమిటీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్న, ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరిగాయని, నిత్యావసర ధరలు పెరుగాయన్నారు. విద్య వైద్య రంగంలో ఉన్న ప్రజాసమస్యలు పక్కన పెట్టి తమ పదవులు కాపాడుకోవడం కోసమే కుమ్ములాటలు పడుతున్నారన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాస రావు, నాయకులు గుబ్బల మనోహర్, దొంగ నాగ సత్యనారాయణ, తోటే జాన్‌బాబు, గుర్రం జాషువా, తులా సత్యనారాయణ, కూనపరెడ్డి రాంబాబు, ఉచ్చుల విష్ణు, కొల్లాబత్తుల సతీష్, మోకా సురేష్, దాకే చిరంజీవి, కోటిపల్లి ఎస్తేర్‌రాణి, పెదపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంట చేలు ఎండిపోతున్నాయంటూ ఆందోళన

మామిడికుదురు: నగరం గ్రామ పరిధిలోని పెర్ల కాలువ గట్టు చివారు భూములకు సాగునీరు అందడం లేదంటూ రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. వంతుల వారీ విధానంలో కూడా నీటి సమస్య తప్పడం లేదని రైతులు పోలవరపు నాగేశ్వరరావు, బత్తుల సత్యనారాయణమూర్తి, నయినాల బ్రహ్మాజీ వాపోయారు. ఇప్పటికే ఆయిల్ ఇంజన్‌తో డ్రైన్‌లోని నీటిని తొడుకున్నామన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంగ పండించామని పంట చివరి దశకు వచ్చే సరికి సాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. పంట పొలాలు నెర్రలు తీశాయన్నారు. ఈ పరిస్థితుల్లో సాగునీరు అందించకుంటే పంట ఎందుకూ పనికి రాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్‌ను వివరణ కోరగా తక్షణం ఆ పొలాలకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

సునీత విలియమ్స్‌కు విద్యార్థుల ఘన స్వాగతం



సునీతకు స్వాగతం పలికిన విద్యార్థులు

మలికిపురం: అంతరిక్షవాసం ముగించుకుని వచ్చిన భారత సంతతికి చెందిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ బారీ విల్మోర్ బుధవారం తెల్లవారు జామున భూమికి తిరిగిరానున్న నేపథ్యంలో మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థులంతా సునీత అంటూ మానవహారంగా ఏర్పడి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ఐఎస్ఎస్‌లో 9 నెలల పాటు గడపాల్సి వచ్చినా సునీత ఎక్కడా డీలా పడలేదని, మొక్కవోని ఆత్మస్థైర్యం ప్రదర్శించారని ఆమెను ప్రశంశించారు. ఒకొక్కసారి పరిస్థితులు మనకు అనుకూలంగా లేక పోయినా ధైర్యంతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ విషయంలో సునీత విలియమ్స్ బృందం యావత్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. సునీత యు ఆర్ గ్రేట్ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా శాంతకుమారి



శాంతకుమారికి ఘన స్వాగతం పలుకుతున్న మండల స్థాయి అధికారులు

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ ఏ రాజు నేతృత్వంలో మండల స్థాయి అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులందరినీ మండల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆలమూరు మండలాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీ లావణ్య, వైద్యాధికారి డి.సాయికిషోర్, ఏపీఓ జి.అరుణకుమారి, ఏపీఎం ఎం.ధనరాజు, ఎంఈఓ బి.అప్పాజీ, సూపరిండెంటెండ్ ఎం.మెహెర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎస్టీ ఏరియాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆహార పదార్థాల నిల్వలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిని సమర్థవంతంగా నిర్వహించే విధంగా పర్యవేక్షించవలసిన బాధ్యతను సీడీపీఓ అధికారి గజలక్ష్మి, సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, అరుంధతి తీసుకోవాలని ఆదేశించారు.

బూత్ కమిటీల ఏర్పాటుకు కృషి

సఖినేటిపల్లి: మండలంలో 60 బూత్ కమిటీలు ఏర్పాటు చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మెంబర్, మండల పార్టీ ఇన్‌చార్జి పాలూరి సత్యానందం సూచించారు. మంగళవారం సఖినేటిపల్లిలో పార్టీ నాయకుడు ఇందుకూరి సుబ్బరాజు ఇంటి వద్ద మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యానందం ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అందిస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా విస్తృత ప్రచారం చేయా లని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీగా సోము వీర్రాజు నియమితులు అవ్వడంపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది. మండల పార్టీ కార్యాలయానికి రెండు సెంట్లు భూమిని వితరణ చేసిన రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివ రామ కృష్ణంరాజును సమావేశం అభినందించింది. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస నగేష్, నియోజకవర్గ కన్వీనర్ రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై విద్యార్థులతో చర్చ

అయినవిల్లి: పదో తరగతి పరీక్షల జరుగుతున్న తీరుపై ఆ తరగతి విద్యార్థులతో పదో తరగతి పరీక్షల జిల్లా ప్రత్యేక పరిశీలకులు, స్టేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ముప్పా రామలింగం బుధవారం చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పబ్లిక్ పరీక్షలపై ఆరా తీశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అదేవిధంగా పాఠశాలలో దాతలతో నిర్మించిన డైనింగ్ హాలును, వేదిక నిర్మాణమును పరిశీలించి ఆయన అభినందించారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ పీఎంశ్రీ అభివృద్ధి పనుల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయలు నిమ్మకాయల గణేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించి రైతులకు తగిన న్యాయం చేయాలని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీకర్ మాట్లాడుతూ జొన్నాడలో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా నెలకొన్న సమస్యలపై గ్రామ రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.డిప్యూటీ తహసీల్దార్ ఎం.సుబ్బరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రభావతి, సర్వేయర్ ప్రభావతి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై దృష్టి



నగరంలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ శాంతాలక్ష్మి

మామిడికుదురు: తడి చెత్త, పొడి చెత్త సేకరణపై దృష్టి సారించాలని డీపీఓ శాంతాలక్ష్మి సూచించారు. ఆమె మంగళవారం నగరం గ్రామంలో పర్యటించారు. ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పీవీఎస్‌వీ ప్రసాద్, పీవీఆర్‌కే రాజుతో మాట్లాడారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్థానిక మహిళలతో మాట్లాడారు. వారికి సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకారం అందించాలన్నారు. అనంతరం పంచాయతీ పన్నుల వసూలుపై డీపీఓ కార్యదర్శులతో మాట్లాడారు.

ఆకట్టుకున్న చిన్నారుల కూచిపూడి నృత్యం



వాడపాలెంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

కొత్తపేట: వాడపాలెం గ్రామ దేవత మారెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక, సంప్రదాయ ప్రదర్శనల్లో భాగంగా సోమవారం రాత్రి చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారులు కథారూపానికి అనుగుణంగా హావ భావాలతో ప్రదర్శించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్నారులకు కళలపై, నృత్య ప్రదర్శనపై ఉన్న మక్కువకు ఈ ప్రదర్శన గొప్ప నిదర్శనమని వక్తలు కొనియాడారు. సందర్భంగా చిన్నారులను నాట్యంలో తీర్చిదిద్దిన ఈ నాట్యాచార్యుడు కోలా రామును కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. చిన్నరులకు మెమెంటోలు అందజేశారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి



నగరం పిల్లి రామారావు కాలనీలో సమస్యలను వివరిస్తున్న ముస్లిం మహిళలు

మామిడికుదురు: నగరం గ్రామంలోని పిల్లి రామారావు కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి చెరువులోకి కలుషితమైన నీటిని పంపింగ్ చేస్తున్నారంటూ స్థానిక ముస్లిం మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. నలుపు రంగులో ఉన్న మురికి నీటిని మంచినీటి చెరువులోకి తోడడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని వాపోయారు. అయితే పంట కాలువను బాగు చేసిన అనంతరమే మోటారుతో పంట కాలువ నీటిని తోడుతున్నామని పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, జాలెం సుబ్బారావు, వార్డు సభ్యులు తెలిపారు. ఇక్కడ ఏ విధమైన కలుషిత నీటిని తోడడం లేదన్నారు. తమకు డ్రైనేజ్ సదుపాయం కల్పించాలని కాలనీకి చెందిన ముస్లిం మహిళలు కోరారు. పంట కాలువలోకి ఏర్పాటు చేసిన డ్రైనేజ్ తూరలను సమూలంగా తొలగించాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. కాలుష్యం బారిన పడుతున్న నీటిని పంట పొలాలకు మళ్లించడం వల్ల తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు.

రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడికి ఘన సత్కారం



వీరబ్రహ్మాన్ని సత్కరిస్తున్న మండలశాఖ

ఆలమూరు: ఇటీవల రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గుత్తుల వీరబ్రహ్మాన్ని మంగళవారం ఘనంగా సత్కరించారు. మండల బీసీ సంఘ అధ్యక్షుడు బి.లోకేష్, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ సత్కార సభ జరిగింది. మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు విచ్చేసి రాష్ట్ర అధ్యక్షులు వీరబ్రహ్మాంకు అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించి మెమొంటోను బహూకరించారు. ఆలమూరుకు చెందిన ఆయన ప్రస్తుతం జొన్నాడ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆయన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షులుగా పనిచేశారు.

బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తాని రాష్ట్ర అధ్యక్షులడు వీరబ్రహ్మాం హామీ ఇచ్చారు. ఇటీవల అన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి బీసీ ఉద్యోగుల సంఘ సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ, పూర్వ ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ వనుం లక్ష్మణ రావు, వైవీవీ రమణ, వాకా గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ అమ్మవారి లడ్డూ ప్రసాదం పరిశీలన



లడ్డూ నాణ్యతను పరిశీలిస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అందుబాటులో ఉంచిన లడ్డూ ప్రసాదం నాణ్యత, బరువు, రేటు విషయాలను మంగళవారం అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పరిశీలన చేశారు. ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భక్తులకు విక్రయిస్తున్న ఆట వస్తువులు, వాటి రేట్లు గురించి ఆరా తీశారు. వీటితో పాటు ఆలయం వద్ద భక్తులు ఇస్తున్న విరాళాలు కౌంటర్‌ను కూడా ఆయన పరిశీలించారు. అంతర్వేది ఆలయ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు పరామర్శ



జెడ్పీచైర్మన్ పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అయినవిల్లి: కంటి సంబంధ శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును కాకినాడలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ పరామర్శించారు. ఆయనను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతు చికిత్స పొందుతున్న పలివెల సాయిని కూడా పరామర్శించారు. విద్యాసాగర్ వెంట అయినవిల్లి మండల వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపాక జోషి కుమార్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, వెలువలపల్లి సర్పంచ్ బొంతు మణి శ్రీనివాస్, మట్టపర్తి శ్రీనివాస్, రెడ్డి గనిరాజు తదితరులు ఉన్నారు.

రోగులకు సకాలంలో సేవలు అందించాలి

అంబాజీపేట: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి వైద్యాధికారి రవికుమార్ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు రోగాల బారిన పడకుండా వారు తీసుకోవల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రి వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ తీవ్రతకు ఎవరైన అస్వస్థతకు గురైతే తక్షణమే ఆస్పత్రికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలోచ సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

అంబాజీపేట: అధికారులంతా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి డెవలప్‌మెంట్ యాక్టివిటీపై దృష్టి పెట్టి నివేదిక ఇవ్వాలని పి.గన్నవరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మురళీకృష్ణ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మండల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గ విజన్ ప్లాన్ 2047లో భాగంగా అధికారులందరితో డెవలప్‌మెంట్ పై సమీక్ష నిర్వహించి సలహాలు సూచనలను తీసుకుంటమాన్నరు. అలాగే త్వరలో ప్రజాప్రతినిధులు, అధికారులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. అనంతరం నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఈ సమావేశంలో అంబాజీపేట, పి.గన్నవరం ఎంపీడీఓలు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు

సఖినేటిపల్లి: బాలికను చేయిపట్టుకుని లాగిన వైనంపై ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు చెప్పిన వివరాల ప్రకారం.. ఉయ్యూరువారి మెరకలో సోమవారం బాలిక ఇంటి వద్ద బట్టలు ఆరబెట్టు చుండగా టవల్ ఒకటి గాలికి పక్క నున్న ఇంట్లో పడింది. దీంతో టవల్ కోసం వెళ్లి తీసుకొని వస్తుండగా ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహరద సలట్ అను యువకుడు సదరు యువతిని చేయిపట్టుకొని లాగాడు. యువతి కేకలు వేయడంతో తల్లి హుటాహుటిన రావడంతో అక్కడి నుంచి మహరద పరారి అయినట్టు పోలీసులు చెప్పారు. దీనిపై ఆ యువతి రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెల్లడించారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

మామిడికుదురు: గ్రామంలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా వీధుల్లో ఉన్న చెత్తను ఒక చోటకు చేర్చి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టరు ద్వారా డంపింగ్ యాడ్‌కు తరలించారు. వీటితో పాటు అపార్టుమెంట్లలోని చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. గ్రామ సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్ ప్రత్యేక పారిశుధ్యం డ్రైవ్‌ను పరిశీలించారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదం దురదృష్టకరం

రాజోలు: రాష్ట్ర క్యాబినేట్ ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం దురదృష్టకరమని రాజోలు మండల మాలల న్యాయ పోరాట సమితి నాయకులు అన్నారు. మంగళవారం రాజోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట మాల సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. మండల జేఏసీ అధ్యక్షుడు సురేష్ కుమార్, లిఖితపూడి బుజ్జి, మధు, వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.